క్లుప్తంగా

పోచంపల్లిలో సీడ్‌బాల్ క్యాంపెయిన్



వేల్పూర్: మండలంలోని పోచంపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో సీడ్‌బాల్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో విత్తన బంతులు తయారు చేయించారు. వీడీసీ ఉమ్మడి స్థలంలో ఆ బంతులను విద్యార్థులతో వేయించారు. పర్యావరణం కాపాడడానికి, పిల్లలకు విత్తన బంతులపై అవగాహన పెంపొందిండానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సుస్థిర వ్యవసాయకేంద్రం ప్రోగ్రాం మేనేజర్ ఉదయ్, సీఆర్పీలు చింత శ్రీనివాస్, నోముల మహేందర్, శివసాయి, వెంకటేశ్, హెచ్ఎం లింబాద్రి, జీపీ కార్యదర్శి కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంగనాథ ఆలయంలో సీఐసీ కమిషనర్ పూజలు



బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ రంగనాథుని ఆలయాన్ని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ) చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలి

రుద్రూర్: ఉపాధ్యాయులు తరగతి గదిలోని ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. మండలంలోని చిక్కడపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. విద్యార్థులు సరైన అభ్యాసన సామర్థ్యాలు సాధించక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బోధన పద్ధతులను మార్చాలని హెచ్ఎంకు సూచించారు. అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బార్ల మోహన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

డొంకేశ్వర్: దివంగత నేత, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బార్ల మోహన్‌రెడ్డి ఆశయాలను కొనసాగించాలని యూత్ కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బార్ల మోహన్‌రెడ్డి 13వ వర్ధంతి నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిసెర భూమేశ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ సుమన్, సుంకరి నాగరాజు, వంశీ, శ్రీధర్, శివశంకర్, రాము, చిన్నారెడ్డి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో ముగ్గురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగాభూషణం, మాజీ ఎంపీటీసీ రాంరాజుగౌడ్, నాయకులు శరత్, రహీమొద్దీన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మండల కేంద్రంలో ఇద్దరు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు రమేశ్, అనిల్ కుమార్ పంపిణీ చేశారు. నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను ప్రోత్సహించాలి

బోధన్ టౌన్: మహిళా సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మెప్మా మహిళా సంఘ సభ్యులు తయారు చేస్తున్న ఆహార పదార్థాలు, స్వీట్లను మహిళా సంఘాల సభ్యుల వద్ద కొనుగోలు చేయాలని అన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో అన్వేష్‌రెడ్డి

వేల్పూర్: పచ్చలనడ్కుడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ,ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయం సాధించాలి

ఆర్మూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సూచించారు. ఆర్మూర్ నియోజకవర్గంలో బుధవారం ఆయన పర్యటించి కార్యకర్తలతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. అనంతరం పలువురు నేతలను పరామర్శించి పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు.

కుంటలను తలపిస్తున్న రోడ్లు

- పోచంపాడ్ కాలనీలో ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాల వెనుక భాగాన రోడ్డుపై నిలిచిన నీరు



పోచంపాడ్ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు అంతర్గత రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. రోడ్లపై నిలిచిన వర్షపు నీటితో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలోనే ఈ కాలనీని నిర్మించారు. నాటి నుంచి కాలనీ నిర్వహణ బాధ్యతలను ఎస్సారెస్పీ ప్రాజెక్టు కార్యాలయ అధికారులు నిర్వహించేవారు. కానీ పోచంపాడ్ ప్రత్యేక జీపీ ఏర్పడిన తర్వాత గ్రామ పంచాయతీ ద్వారానే నిర్వహణ చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. కానీ ఇటు ఎస్సారెస్పీ కార్యాలయం నుంచి కాని, జీపీ నుంచి కాని కాలనీ నిర్వహణ బాధ్యతలు చేపట్టడం లేదు. దీంతో కాలనీ పరిస్థితి అధ్వానంగా మారుతోంది. నిర్వహణ బాధ్యత ఎవరూ చేపట్టక పోవడంతో రోడ్ల పక్కన ఉన్న మురికి కాలువలు పూడికమయంగా మారాయి. దీంతో వర్షపు నీరు ముందుకు వెళ్లడం లేదు. వర్షం కురిస్తే కాలనీవాసులకు అవస్థలు రెండింతలు అవుతున్నాయి. వర్షపు నీరు భారీగా రోడ్లపై నిలిచి ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని రోడ్లు పూర్తిగా గుంతల మయంగా మారాయి. వర్షపు నీరు నిల్వ ఉండటంతో గుంతలు కనిపించక పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇళ్లలోకి నీరు వస్తోంది



ఇటీవల కురిసిన వర్షపు నీటితో కాలనీ రోడ్లు కుంటల్లా మారాయి. మురికి కాలువలు సరిగా లేకపోవడంతో రోడ్లపై నిలిచిన నీరు ఇళ్లలోకి చేరుతోంది. ఇబ్బందులు పడు తున్నాం. అధికారులు స్పందించాలి.

– సుశీల, కాలనీవాసి, పోచంపాడ్

ఎవరూ పట్టించుకోవడం లేదు



కాలనీలో రోడ్లు, మురికి కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. కాలనీలో నెలకొన్న సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– పోశెట్టి, కాలనీవాసి, పోచంపాడ్

బహుళ జాతి కంపెనీలు దేశాన్ని వదిలి వెళ్లాలి



బోధన్‌లో మాట్లాడుతున్న నాయకులు



వర్నిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బోధన్/ మాక్లూర్/ వర్ని/ నవీపేట: బహుళ జాతి కంపెనీలు మన దేశాన్ని, వ్యవసాయరంగాన్ని వదిలి వెళ్లాలని వామపక్ష కార్మిక సంఘాల డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు అమెరికా దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మ, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పంద ప్రతులను దహనం చేశారు. నాయకులు బి.మల్లేశ్, పుట్ట వరదయ్య, ప్రతినిధి దాల్‌మల్కు పోశెట్టి, శంకర్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్ చౌరస్తా వద్ద సీపీఎం మండల నాయకుడు కొండ గంగాధర్ ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు బండారి ఎల్లయ్య, ద్యారంగుల శ్రీనివాస్, ర్యాపని సుదర్శన్, బి ఆనంద్, ఉప్పు నవీన్, దండ్ల నర్సిములు పాల్గొన్నారు. వర్ని మండల కేంద్రంలో కార్పొరేట్ కో హటావో దేశ్ కో బచావో నినాదంతో సీపీఎం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, లక్ష్మణ్, రవీందర్, సాయిలు, శ్రీనివాస్, మారయ్య, భూమయ్య, గంగారాం పాల్గొన్నారు. నవీపేట మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌సింగ్, వసంత్, గోవింద్, రాధ, ఆంజనేయులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన స్థానికులు



మాక్లూర్: మండలంలోని కృష్ణనగర్ వద్ద గుంతలు పడ్డ రోడ్లను స్థానికులు స్వచ్ఛందంగా పూడ్చివేశారు. అరకిలోమీటరు పొడవున రోడ్డు భారీ గుంతలమయంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీంతో స్థానికులు సమస్యను గుర్తించి గుంతలను పూడ్చివేశారు. గుంతల పూడ్చి వేతతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



నందిపేట సమావేశంలో పాల్గొన్న అధికారులు

నందిపేట్: రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నందిపేట ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నందిపేట, డొంకేశ్వర్ మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు సతీశ్, నరేశ్, డీఎల్‌పీవో శివకృష్ణ, వెటర్నరీ డాక్టర్ నవీన్, వైద్యాధికారి ప్రవీణ్, ఎంపీవో లక్ష్మీప్రసాద్, ట్రాన్స్ ఏడీఈ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

బోధన్: భారీ నుంచి అతిభారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాలూర తహసీల్దార్ శశిభూషణ్ సూచించారు. మంజీర నది తీరం, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

బోధన్ టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని, సమస్యలు ఏమైనా ఉంటే మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ మేళా



డొంకేశ్వర్‌లో ఇందిరమ్మ ఇంటికి ముగ్గుపోసిన అధికారులు, నాయకులు



మాక్లూర్‌లో ఎంపీడీవో బ్రహ్మానందం



సాలూర మండలం హున్సాలో భూమిపూజ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి



వేల్పూర్‌లో..



మోస్రా మండలం చింతకుంటలో..



పిప్రిలో మార్కింగ్ చేసిన అధికారులు

డొంకేశ్వర్/ మాక్లూర్/ వేల్పూర్/ వర్ని(మోస్రా)/ పెర్కిట్/ బాల్కొండ/ బోధన్/ బోధన్ రూరల్: డొంకేశ్వర్, మాక్లూర్, వేల్పూర్, మోస్రా, పెర్కిట్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, సాలూర, బోధన్ మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ మేళా బుధవారం నిర్వహించారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు, నాయకులు భూమిపూజ చేసి ముగ్గుపోసి పనులను ప్రారంభించారు. డొంకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేశ్ రెడ్డి, వీవో అధ్యక్షులు సునీత, లావణ్య, నాయకులు పాల్గొన్నారు. మాక్లూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంపీవో టి శ్రీనివాస్, జీపీ కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు. వేల్పూర్‌లో మండల ప్రత్యేక అధికారి భారతి, ఎంపీడీవో బాలకిషన్, ఐకేపీ సీసీ ఎడెల్లి రవి, జీపీ కార్యదర్శి వినోద్, ఐకేపీ వీవోఏలు మాధురి, కావ్య, లావణ్య, మహిళలు పాల్గొన్నారు. మోస్రా మండలం చింతకుంటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం గంగాధర్, జీపీ కార్యదర్శి శ్రావణ్, సీసీ నర్సయ్య పాల్గొన్నారు. ఆర్మూర్ మండలం పిప్రిలో ఆర్మూర్ మండల ఇన్‌చార్జి అధికారి, డీసీవో ఎస్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో శివాజీ, మాజీ సర్పంచ్ సుర్బిర్యాల జీవన్ రెడ్డి, కేపీ గంగా రెడ్డి, జి నర్సా రెడ్డి, పద్మ, కార్యదర్శి మురళికాంత్, లబ్ధిదారులు పాల్గొన్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో ఎంపీడీవోలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, గౌస్‌మొయినొద్దీన్, కొండ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. సాలూర మండలంలోని హున్సా, సాలంపాడ్‌క్యాంప్, సాలూర, జాడిజమాల్‌పూర్ గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు మండల ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్ మార్కింగ్, భూమిపూజ చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాజీమంజూష, ఐకేపీ ఏపీఎం సాయిలు, నాయకులు పాల్గొన్నారు. బోధన్ మండలం లంగ్డాపూర్‌లో నిర్వహించిన మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, టీపీసీసీ డెలిగెట్ గంగాశంకర్, ఎంపీవో మధుకర్, జీపీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోధన్: లంగ్డాపూర్‌లో మండల ప్రత్యేకాధికారి



బాల్కొండలో మార్కింగ్ చేసిన అధికారులు



మెండోరాలో..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



జానకంపేటలో అవగాహన కల్పిస్తున్న ఎడపల్లి ఎస్సై రమ, పాల్గొన్న ఉపాధ్యాయులు



పెర్కిట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కల్లెడిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బోధన్/ పెర్కిట్/ బాల్కొండ/ మాక్లూర్/ రుద్రూర్: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ సూచించారు. బుధవారం ఎడపల్లి మండలం జానకంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగించవద్దని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటరమణ చారి, సురేశ్ పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మోడల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో పాటు పోలీసులు, ఉపాధ్యాయులు మాదక ద్రవ్యాలను ముట్టబోము అంటు ప్రతిజ్ఞ చేశారు. ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై శైలెందర్, ఎంఈవో రాజేశ్వర్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని కల్లెడి, చిన్నాపూర్, మాక్లూర్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల విద్యార్థులకు ఏఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు మత్తుపదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఎస్సై సునీల్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోటగిరి జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై సునీల్



బాల్కొండ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ, ఎస్సై, అధ్యాపకులు

అక్బర్‌నగర్‌లో మొరం టిప్పర్ల అడ్డగింత

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ శివారు నుంచి మొరం తరలిస్తున్న వాహనాలను స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి పనుల పేరుతో అనుమతి లేకుండా మొరం తరలిస్తున్నారని స్థానికులు ట్రాక్టర్‌ను అడ్డంగా పెట్టారు. గ్రామ శివారులోని ఉన్న గుట్ట ప్రాంతంలో తవ్వకాలు చేసి మొరం తీసుకెళ్తున్నారంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ భూమిని పేదలకు ఇస్తామని నాటి ప్రజాప్రతినిధులు చెప్పారని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంతాన్ని చదును చేశామన్నారు. వర్నికి చెందిన వ్యక్తులు ఈ ప్రాంతం తమ పట్టాలో ఉందని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుని మొరం తీసుకెళ్తున్నారని ఆరోపించారు. మొరం తరలింపును వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ విషయమై తహసీల్దార్ తారాబాయి దృష్టికి తీసుకెళ్లగా మొరం తరలింపునకు అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో భూమి అభివృద్ధి కోసం వచ్చిన దరఖాస్తు పరిశీలనలో ఉన్నట్లు వివరించారు.

నాణ్యమైన విద్యను అందించాలి



కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

నందిపేట్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. నందిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అధ్యాపకుల హాజరు పట్టికను పరిశీలించారు. కళాశాలలో ఉన్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న బోధన గురించి ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురిస్తే కళాశాల భవనం చుట్టూ నీరు చేరుతోందని విద్యార్థులు, అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు పటేల్ రాజు, నాయకులు నాగసురేశ్, పెయింటర్ రాజు, నవీన్, రవి పాల్గొన్నారు.

భూభారతిని వేగవంతం చేయాలి



బాల్కొండ: భూభారతిలో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో నమోదైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అన్నారు. బుధవారం మెండోరా తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాలు, పరిష్కరించిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సంతోష్‌రెడ్డి , సిబ్బంది ఉన్నారు. అనంతరం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న అతిథి గృహాన్ని సందర్శించారు. ప్రాజెక్ట్ నీటి మట్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఇందిరమ్మ కాలనీని ప్రత్యేక వార్డుగా ప్రకటించాలి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గొల్లపేట ఇందిరమ్మ కాలనీని ప్రత్యేక వార్డుగా ప్రకటించాలని బీజేపీ మండలాధ్యక్షుడు బద్దం రమేశ్‌రెడ్డి ఎంపీడీవో రాజ శ్రీనివాస్‌కు విన్నవించారు. ఇందిరమ్మ కాలనీ 2009లో ఏర్పాటైందని, కాలనీలో 300కు పైగా ఓటర్లు ఉన్నారని వివరించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లోపు ఇందిరమ్మ కాలనీ ఓట్లు అన్ని ఒకే వార్డులో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ పాల్కం నవీన్ పాల్గొన్నారు.

ఇంటింటికి జాతీయ జెండాల అందజేత



రుద్రూర్‌లో గ్రామస్తులకు జాతీయ జెండాను అందజేస్తున్న బీజేపీ నాయకులు

రుద్రూర్/ మాక్లూర్: రుద్రూర్ మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాను బుధవారం పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగుర వేయాలని పార్టీ నాయకులు కోరారు. రుద్రూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, బోజిగొండ అనిల్, జిలకర్ర విజయ్, వి. రామ్‌రాజ్, శివప్రసాద్, చిదుర మహిపాల్, పార్వతీ మురళి, ఎర్రోళ్ల శ్రీనివాస్, నరోజి శ్రీనివాస్ పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్‌లో బీజేవైఎం నాయకులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, జిల్లా కో కన్వీనర్ అమందు విజయ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శి గంగోనె సంతోష్, సీనియర్ నాయకుడు ముప్పిడి గంగారెడ్డి, చింత ప్రవీణ్‌రెడ్డి, గంగోనే వినోద్, డి. రమేశ్‌నాయక్, కె. రాజేందర్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, రాజేశ్వర్, ప్రణీత్, సిసింద్రి, రామావత్ సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.



దాస్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నాగంపేట్‌లో కేంద్ర పథకాలపై అవగాహన

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్‌లో బీజేపీ నాయకులు మహాసంపర్క్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రీనివాస్, ముస్కు భూమేశ్వర్, గడ్డం సంతోష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకం

మాక్లూర్: ఆలిండియా బంజారా సేవా సంఘం రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా మాక్లూర్ మండలం సింగంపల్లి తండాకు చెందిన జాదో సవాయ్‌రామ్ నియామకం అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజార భవనంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో న్యాయవాదులు పాల్గొన్నారు.